

వైసిపి కన్వీనర్ పదవికి బుచ్చిరాజు రాజీనామా

ప్రజాశక్తి - యలమంచిలి

వైసిపి మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ఆవిర్భావం నుండి పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కష్టపడి పని చేశానని తెలిపారు. 15 రోజుల కిందటి వరకు పాలకొల్లు నియోజకవర్గం పార్టీ పరంగా చాలా బలంగా ఉందని, ఈ పరిస్థితుల్లో ఎన్నికలు సమీపించాక నాయకత్వం చేసిన కొన్ని పొరపాట్ల వల్ల చాలా ఉత్సాహంగా పని చేస్తున్న కార్యకర్తలు ఒక్కసారిగా నిరుత్సాహానికి గురయ్యారన్నారు. అనారోగ్య సమస్యతో గతంలోనే తాను కన్వీనర్ పదవి నుండి తప్పుకోవడానికి ప్రయత్నించిన తనను కొంతమంది నాయకులు ఎన్నికల వరకు పని చేయాలని సూచించడంతోనే కొనసాగానని తెలిపారు. ఇప్పుడు తప్పని పరిస్థితుల్లో మండల కన్వీనర్ పదవికి రాజీనామా చేశానని, అయితే పార్టీలోనే కొనసాగుతానని తెలిపారు.

భవితవ్యం.. భద్రం..!

ఏలూరు జిల్లాలో 83.65 శాతం, పశ్చిమలో 82.60 శాతం పోలింగ్

పలుచోట్ల అర్ధరాత్రి వరకూ సాగిన ఓటింగ్

స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఇవిఎంలు

ఏలూరు, భీమవరంల్లో మూడంచెల భద్రతతో గట్టి బందోబస్తు

గెలుపోటములపై ఎవరి లెక్కలు వారివే

గతం కంటే పెరిగిన ఓటింగ్ శాతం

4న ఓట్ల లెక్కింపు



సాయుధ బలగాల పహారాలో స్ట్రాంగ్‌రూమ్‌లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్‌రూముల్లోకి చేరింది. అన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తయ్యాక జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అప్పటి వరకూ ఇవిఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూముల వద్ద మూడంచెల భద్రత, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించి తణుకు, పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల ఇవిఎంలను భీమవరం విష్ణు కాలేజీలో, భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల ఇవిఎంలను భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీలోనూ భద్రపర్చారు. ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఇవిఎంలను సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో భద్రపరిచారు. ఓట్ల లెక్కింపు ఆయా ప్రాంతాల్లోనే జరగనుంది. సోమవారం జరిగిన ఎన్నికల్లో గతంకంటే పోలింగ్‌శాతం పెరిగింది. యువ ఓటర్లు ఈసారి పెద్దఎత్తున ఓటు వేశారు. జిల్లావ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి వరకూ ఓటింగ్ జరిగింది. దీంతో ఇవిఎంలను స్ట్రాంగ్‌రూములకు చేర్చేసరికి తెల్లవారుజాము నాలుగు, ఐదు గంటలు అయ్యింది. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ కేంద్రాలకు చేరిన ప్రతి ఓటరుతోనూ అర్ధరాత్రి అయినా ఓటు వేయించారు. దీంతో ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తంగా 83.65 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో ఈ జిల్లాలో 83.55 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో కేవలం 0.10 శాతం ఓటింగ్ పెరిగిందని చెప్పొచ్చు. ఉంగుటూరు నియోజకవర్గంలో అత్యధికంగా 87.76 శాతం ఓటింగ్ జరగ్గా, అత్యల్పంగా ఏలూరు నియోజకవర్గంలో 70.16 శాతం ఓటింగ్ జరిగింది. ఏలూరు నియోజకవర్గం మినహా జిల్లాలోని మిగిలిన ఆరు నియోజకవర్గాల్లోనూ 80 శాతానికిపైగా ఓటింగ్ జరగడం విశేషం. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 14,72,928 మంది ఓటర్లు ఉండగా 12,16,667 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో జిల్లా మొత్తంగా 82.60 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా ఉండిలో 86.20 శాతం ఓటింగ్ నమోదవ్వగా, తక్కువగా భీమవరంలో 79.35 శాతం ఓటింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో ఈ జిల్లాలో 81.90 శాతం ఓటింగ్ నమోదైంది. గత ఎన్నికల ప్రకారం చూస్తే ఓటింగ్‌శాతం 0.70 శాతం తగ్గినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి వరకూ ఓపిగ్గా నిలబడి పెద్దఎత్తున ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మండుటెండను సైతం లెక్క చేయకుండా జనం తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

గెలుపోటములపై ఎవరి ధీమా వారిదే..

ఎన్నికల ప్రక్రియ ముగియడంతో గెలుపోటములపై అభ్యర్థులు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. రెండు జిల్లాల్లోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో టిడిపి కూటమి, వైసిపి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ప్రతి నియోజకవర్గంలోనూ నువ్వా నేనా అన్నట్లు ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీ పడ్డారు. డబ్బు సైతం పోటీ పడి పంచారు. ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేలు, బహుమతులు సైతం అందజేశారు. ఓటింగ్‌శాతం పెద్దఎత్తున నమోదవడంతో ఎవరికి లాభం చేకూరుతుందనే లెక్కలు కడుతున్నారు. తమ అభ్యర్థికి ఇంత మెజార్టీ వస్తుందని ఒక పార్టీ, కాదు తమ పార్టీ అభ్యర్థికి మెజార్టీ ఎక్కువ వస్తుందని ఇలా గెలుపోటములపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు రావడానికి మరో 20 రోజుల గడువు ఉండటంతో గెలుపోటములపైనే ప్రధాన చర్చ నడుస్తోంది. గెలుపోటములతోపాటు మెజార్టీపైనా బెట్టింగుల జోరు సాగుతోంది.

'పశ్చిమ'లో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు ఇలా

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	ఓటింగ్‌శాతం
ఆచంట	1,80,017	1,49,048	82.80
పాలకొల్లు	1,95,057	1,60,489	82.28
నరసాపురం	1,70,448	1,43,825	84.38
భీమవరం	2,53,116	2,00,857	79.35
ఉండి	2,24,725	1,93,722	86.20
తణుకు	2,34,575	1,92,736	82.16
తాడేపల్లిగూడెం	2,14,985	1,75,990	81.86
మొత్తం	14,72,923	12,16,667	82.60

ఏడు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు 7,51,313 మంది ఓటర్లుండగా, ఓటువేసిన వారు 6,14,077 మంది, పురుష ఓటర్లు 7,21,532 మందికి ఓటువేసిన వారు 6,02,543 మంది ఉన్నారు.

ఏలూరు జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటింగ్ ఇలా

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
చింతలపూడి	2,73,069	2,22,608	81.52
దెందులూరు	2,24,013	1,92,901	86.11
ఏలూరు	2,35,345	1,65,132	70.16
కైకలూరు	2,05,604	1,79,536	87.32
నూజివీడు	2,38,981	2,10,155	87.94
పోలవరం	2,53,981	2,18,366	85.98
ఉంగుటూరు	2,06,437	1,81,164	87.76
మొత్తం	16,37,430	13,69,862	83.65

ఓటు వేసిన మహిళా ఓటర్లు 6,93,172 మంది, పురుష ఓటర్లు 6,76,639 మంది ఉండగా ఇతరులు 55 మంది ఉన్నారు.

క్రాస్ ఓటింగ్ కలవరం..!



అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం

బిసి సామాజిక తరగతి ఎక్కువ ఓటింగున్న స్థానాల్లో మరింత ప్రభావం పడే అవకాశం

గెలుపోటములపై ఎవరి ధీమా వారిదే

ప్రజాశక్తి - భీమవరం

క్రాస్ ఓటింగ్ ప్రచారం అభ్యర్థులను కలవరపాటుకు గురి చేస్తుంది. అభ్యర్థుల గెలుపోటముల అంచనాలను సైతం క్రాస్ ఓటింగ్ తారుమారు చేసిందనే చెప్పొచ్చు. దీంతో అభ్యర్థుల విజయావకాశాలపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నా లోలోన గుబులు నెలకొందని తెలుస్తోంది. గతానికి భిన్నంగా అయితే బిసి సామాజిక తరగతి ఎక్కువ ఓటింగ్ ఉన్న స్థానాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉండొచ్చనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాలు ఉన్నాయి. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉదయమే బారులు తీరినప్పటికీ రాత్రి 11 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగింది. జిల్లావ్యాప్తంగా 82.60 శాతం పోలింగ్ నమోదైంది. ఆచంట నియోజకవర్గంలో 82.80 శాతం, పాలకొల్లులో 82.28 శాతం, నరసాపురంలో 84.38 శాతం, భీమవరంలో 79.35 శాతం, ఉండిలో 86.20 శాతం, తణుకులో 82.16 శాతం, తాడేపల్లిగూడెంలో 81.86 శాతం పోలింగ్ నమోదైంది. ఒక్క భీమవరం నియోజకవర్గం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గంలో పోలింగ్ 80 శాతానికిపైగా నమోదు కావడం విశేషం. అయితే పోలింగ్ అధిక శాతం నమోదు కావడంతో అభ్యర్థుల గెలుపోటములపై ప్రధాన చర్చ సాగుతోంది. ఎవరిని విజయ వరిస్తుంది, ఎవరు పరాజయం పాలవుతారనే దానిపై లెక్కలు కడుతున్నారు. అయితే జిల్లాలో టిడిపి కూటమి బలంగా ఉన్నప్పటికీ ఎంపీ స్థానంపై క్రాస్‌ఓటింగ్ గుబులు వెంటాడుతోంది. నర్సాపురం ఎంపీ స్థానంలో వైసిపి అభ్యర్థిగా గూడూరి ఉమాబాల, బిజెపి అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, కాంగ్రెస్ అభ్యర్థిగా కెబిఆర్.నాయుడుతోపాటు మొత్తం 21 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గడిచిన ఎన్నికల్లో పొత్తులో భాగంగా బిజెపి నుంచి పోటీ చేసిన క్షత్రియ సామాజిక తరగతికి చెందిన సినీనటుడు కృష్ణంరాజు, గోకరాజు గంగరాజు గెలుపొందారు. అప్పట్లో ప్రధాన పార్టీలు సైతం క్షత్రియ సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులనే బరిలోకి దింపాయి. ఈసారి వైసిపి సరికొత్త వ్యూహానికి తెరలేపి శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన బిసి అభ్యర్థిని బరిలోకి దింపింది. ఆచంట, పాలకొల్లు, భీమవరం, తణుకు వంటి పలు నియోజకవర్గాల్లో శెట్టిబలిజ ఓటర్లు పెద్దసంఖ్యలో ఉన్నారు. వైసిపి సైతం సంస్థాగతంగా బలంగానే ఉంది. గడిచిన ఎన్నికల్లో ఇక్కడున్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదు స్థానాలను వైసిపి గెలుచుకోవడంతోపాటు నరసాపురం ఎంపీ స్థానాన్ని సైతం కైవసం చేసుకుంది. దీన్నిబట్టి నరసాపురం లోక్‌సభ స్థానంలో వైసిపి బలంగా ఉంది. దీంతో ఇక్కడ గెలుపోటములపై ప్రధానంగా చర్చ సాగుతోంది. అసెంబ్లీ స్థానంలో నచ్చిన పార్టీ అభ్యర్థికి ఓటు వేసుకున్నా ఎంపీ ఓటు మాత్రం గూడూరి ఉమాబాలకు వేయాలని శెట్టిబలిజ సామాజిక తరగతిలో విస్తృత ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో క్రాస్ ఓటింగ్ అధికంగా జరుగుంటుందనే చర్చ ప్రధానంగా ఉంది. నరసాపురం, ఆచంట, పాలకొల్లు, భీమవరం, తణుకు నియోజకవర్గాల్లో క్రాస్‌ఓటింగ్ జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది. దీంతోపాటు మహిళలు, వృద్ధుల సైలెంట్ ఓటింగ్ వైసిపికి కలిసొచ్చే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ప్రభుత్వ వ్యతిరేకత ఓటు అసెంబ్లీ స్థానంలో ప్రభావం చూపినా ఎంపీ ఓటు విషయంలో ఆ వ్యతిరేకత కన్పించలేదని చెబుతున్నారు. అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులు పోటాపోటీగా సొమ్ము పంచడం కూడా రెండు ఓట్లలో కూటమికి ఒకటి, వైసిపికి ఒకటి అనే రీతిన క్రాస్ ఓటింగ్ సాగిందనే విశ్లేషణ కూడా తెరపైకి వచ్చింది. ఏదేమైనా క్రాస్‌ఓటింగ్ మాత్రం ఎంపీ అభ్యర్థుల విజయావకాశాలపై ప్రభావం చూపుతాయనేది అందరి అంచనా. అయితే ఇది బిజెపికి అనుకూలమా, లేక వైసిపికి అనుకూలమా అనేది ఎవరికి వారు తమకే అంటే తమకే అని ధీమా వ్యక్తం చేస్తుండటం విశేషం. అదే క్రమంలో ఇండియా వేదిక తరఫున కాంగ్రెస్ అభ్యర్థిగా కెబిఆర్.నాయుడుకు సైతం అధికంగా ఓట్లు పోలైనట్లు తెలుస్తోంది. బిజెపి వ్యతిరేక ఓటింగ్‌తోపాటు సిపిఎం, సిపిఐ మద్దతుతో గణనీయమైన ఓట్లు సాధించినట్లు సమాచారం. ఇండియా వేదిక అభ్యర్థి ప్రభావం కూడా ఇతర అభ్యర్థుల విజయావకాశాలపై ఉంటుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఈ క్రమంలో క్రాస్ ఓటింగ్ ఎవరికి లాభం.. ఎవరికి నష్టమో తెలియాలంటే జూన్ నాలుగో తేదీ వరకూ వేచిచూడాల్సిందే.

గట్టెక్కుతామా?

'ఉండి'లో గెలుపుపై ఎవరి ధీమా వారిదే

పెరిగిన ఓటింగ్ శాతం



ప్రజాశక్తి - కాళ్ల

ఈ సార్వత్రిక ఎన్నికల్లో సర్వశక్తులు ఒడ్డి పోరాడిన అభ్యర్థులు గెలుపు లెక్కల్లో మునిగిపోయారు. ఓటింగ్ సరళిని నేతలు విశ్లేషించుకుంటున్నారు. ఏ గ్రామంలో ఎన్ని ఓట్లు వచ్చాయో అభ్యర్థులు సమీక్షిస్తున్నారు. ఎక్కడ మెజార్టీ రావొచ్చు.. ఎక్కడ తగ్గొచ్చు కారణాలపై మల్లగుల్లాలు పడుతున్నారు.

జిల్లాలో టిడిపికి బలమైన స్థానాల్లో ఒకటి ఉండి నియోజకవర్గం. వైసిపి గత రెండు ఎన్నికల్లోనూ ఇక్కడ గెలుపొందలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో 84.75 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి ఎన్నికల్లో నియోజకవర్గంలో 2,24,725 మంది ఓటర్లకుగాను 1,93,783 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 86.23 శాతం నమోదైంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న స్థానిక ఓటర్లు ఇక్కడికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతోపాటు పలు కారణాలు పోలింగ్ శాతం పెరగడానికి కారణమని అంచనా వేస్తున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద జనం బారులుతీరారు. రాత్రి ఎనిమిది గంటల వరకూ ఇదే పరిస్థితి కొనసాగడం గమనార్హం. 118 పోలింగ్ స్టేషన్లలో రాత్రి 10.30 గంటల వరకూ ఓటింగ్ సాగింది. ఇవిఎంలు సరిగ్గా పని చేయకపోవడం, వివిప్యాట్ స్లిప్‌రావడం ఆలస్యం తదితర కారణాల రీత్యా ఓటింగ్ నత్తనడకన సాగిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. పోలైన 1,93,783 ఓట్లలో పురుష ఓటర్లు 87.80 శాతం ఉండగా మహిళా ఓటర్లు 84.72 శాతం ఉన్నారు. ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజును చివరి నిమిషంలో తప్పించి ఎంపీ రఘురామకృష్ణంరాజును టిడిపి బరిలోకి దింపింది. అధిష్టాన్యం జోక్యంతో రఘురామకృష్ణంరాజు తరఫున రామరాజు గట్టిగానే పని చేసినా దిగువ కేడర్‌లో కొంతమంది రఘురామకృష్ణంరాజుకు వ్యతిరేకంగా పని చేసినట్లు తెలుస్తోంది. ఇది టిడిపి విజయావకాశాలను కొంతమేర దెబ్బతీసిందనే అంచనాలున్నాయి. మాజీ ఎంఎల్ఎ శివరామరాజు చీల్చే ఓట్ల సంఖ్యను బట్టి టిడిపి, వైసిపి అభ్యర్థుల విజయావకాశాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. మహిళలు ఎక్కువ శాతం ఓటింగ్‌లో పాల్గొనడం, వారు ఎటువైపు మొగ్గుచూపారనేది తెలియకపోవడంతో కొంత సస్పెన్స్ నెలకొంది. వైసిపికి సానుకూలమా.. ప్రతికూలమా అనే చర్చ పెద్దఎత్తున సాగుతోంది.

ఇక నోట్ల పంపిణీ కూడా ఓ మేర ప్రభావం చూపనుందనే ప్రచారం సాగుతోంది. టిడిపి, వైసిపితోపాటు ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థిగా బరిలోకి దిగిన టిడిపి రెబల్ శివరామరాజు సైతం ఓటుకు నోటు అందించడంపై సర్వత్రా చర్చ సాగుతోంది. తక్కువ ఓట్లు చీల్చితే వైసిపికి, ఎక్కువ ఓట్లు చీల్చితే టిడిపికి నష్టమని ఆ నియోజకవర్గంలోని పరిశీలకులు చెబుతున్నారు. ఏదేమైనా టిడిపికి బలమైన సీటులోనూ అభ్యర్థి మార్పు ఇతర కారణాలతో ఆ పార్టీ కొంత ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇది ఎవరికి వరమో.. ఎవరికి నష్టమో తేలాలంటే మరో 20 రోజులు వేచిచూడాల్సిందే.

మళ్లీ మంత్రి అయ్యేదెవరో..!

ఆచంటలో అంతుబట్టని ఓటరు నాడి

గెలుపుపై ఎవరి లెక్కలు వారివే

ప్రజాశక్తి - ఆచంట

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియడంతో గెలుపోటములపై అంచనాల్లో అభ్యర్థులతోపాటు నేతలు తలమునకలయ్యారు. పోలింగ్ రోజు వరకూ క్షేత్రస్థాయిలో హడావుడిగా తిరిగిన నేతలు సోమవారం రాత్రి నుంచి ఇళ్లకు, కార్యాలయాలకే పరిమితమైనా ఓటింగ్ సరళిపై విశ్లేషించుకోవడమే కన్పించింది.




ఆచంట నియోజకవర్గంలో తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో వైసిపి తరఫున చెరుకువాడ శ్రీరంగనాథరాజు, టిడిపి తరఫున పితాని సత్యనారాయణ మాజీ మంత్రులు కావడంతో పోరు హోరాహోరీగా సాగింది. ప్రచారం నుంచి ఇరుపక్షాలు ఢీ అంటే ఢీ అనే రీతిన ముందుకు సాగాయి. నియోజకవర్గంలో 1,80,017 ఓట్లు ఉండగా 1,49,043 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా 82.80 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో 78.01 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో కంటే ఈసారి నాలుగు శాతం అధికంగా పోలింగ్ నమోదైంది. ఓటింగ్ పెరగడం ఒకటైతే మొదటి ఓటు ఎంపీకా, ఎంఎల్ఎకా అనేది గ్రామీణుల్లో చాలా మందికి అర్థం కాలేదు. ఇది ఎవరికి నష్టం చేకూర్చుతుందనే చర్చ కూడా సాగుతోంది. ఈ నేపథ్యంలో వైసిపి అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సంక్షేమ పథకాలు తమకు విజయ సోపానాలని పూర్తి ధీమాతో ఉన్నారు. అందుకే మహిళలు పెద్దసంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారని చెబుతున్నారు. దీనికితోడు అధికార పార్టీ అభ్యర్థి నియోజకవర్గంలో సుమారు 80 శాతం ఓటర్లకు రూ.2 వేలు చొప్పున పంపిణీ చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఆచంట మండల కేంద్రంలో మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో అందరికీ ఈ నోట్ల పంపిణీ సాగిందని చెబుతున్నారు. అయితే ప్రతిపక్ష అభ్యర్థి తక్కువగానే రూ.వెయ్యి వరకే పంచారని, అదీ కొన్ని ప్రాంతాల్లో సక్రమంగా పంపిణీ చేయలేదని ఇది ఆ పార్టీకి నష్టం చేకూరుస్తుందనే ప్రచారం సాగుతోంది. ఏదేమైనా ఆచంటలో గెలుపుపై ఇరు పార్టీలు ఎవరి అంచనాల్లో వారు మునిగిపోయారు.

భీమవరంలో హోరాహోరీ..!

జనసేన గెలిచేనా.. పవన్ ప్రతీకారం తీరేనా?

మరోసారి గెలుపుపై గ్రంధి ధీమా



ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గంలో అనూహ్యంగా పోలింగ్ శాతం పెరిగింది. సోమవారం ఉదయం నుండి ఓటర్లు పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలొచ్చి ఓట్లు వేశారు. ఒక విధంగా అటు వైసిపి నాయకుల ప్రచారం, ఇటు జనసేన నేతల ప్రచారంతో ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. భీమవరం నియోజకవర్గంలో 2,53116 ఓట్లు ఉండగా 236 బూత్‌ల్లో 1,98,494 ఓట్లు పోలయ్యాయి. అంటే 78.42 శాతం పోలింగ్ నమోదైంది. దీంతో అటు జనసేన, వైసిపి నాయకులు ఓటింగ్ శాతం పెరగడం తమకు అనుకూలం అంటే.. తమకు అనుకూలమని చెబుతున్నారు. జనసేనకు తోడు ఈ ఎన్నికల్లో టిడిపి, బిజెపి మద్దతు తమకు కలిసొచ్చే అంశాలని, అలాగే సిట్టింగ్ ఎంఎల్ఎపై వ్యతిరేకత, ప్రభుత్వ వ్యతిరేకత కూడా తమకు సానుకూలమని జనసేన నేతలు చెబుతున్నారు. దీనికితోడు జనసేన అభ్యర్థి పి.అంజిబాబు గతంలో రెండుసార్లు ఎంఎల్ఎగా పని చేసి వివాదరహితునిగా పేరొందడం తమకు కొండంత బలమని అంటున్నారు. సంక్షేమ పథకాలు తమను గెలిపించనున్నాయని వైసిపి నేతలు చెబుతున్నారు. మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి ఓట్లేయడం తమకే అనుకూలమని వైసిపి శ్రేణులు ఘంటాపథంగా చెబుతున్నాయి. వీరవాసరం మండలంలో పోరు హోరాహోరీగా సాగిందని, భీమవరం టౌన్‌లో ఓట్లే విజేత ఎవరో తేల్చనున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. ఏదేమైనా సీనియర్ ఓటర్లుసైతం తమ జీవితంలో ఇటువంటి ఎన్నికలను తాము ఎప్పుడూ చూడలేదని, ఓటరు నాడి అంతుచిక్కని స్థితి ఉందని అంటున్నారు. ఏదేమైనా ఇక్కడ గెలుపోటములపై వైసిపి, టిడిపి కూటమి ధీమా వ్యక్తం చేస్తుండటం విశేషం.

మంచి మెజారిటీతో గెలుస్తా

టిడిపి ఉండి అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలో మంచి మెజార్టీతో విజయం సాధిస్తానని ఉండి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరు రఘురామకృష్ణంరాజు ధీమా వ్యక్తం చేశారు. పెదఅమిరంలో స్థానిక విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. తనపై పోటీ ఇద్దరు అభ్యర్థులు ఒకే పార్టీకి చెందిన వారిగా భావిస్తున్నానని అన్నారు. అధికారికంగా బరిలో నిలిచిన అభ్యర్థికి, అనధికారికంగా బరిలో నిలిచిన అభ్యర్థికి వైసిపి నాయకత్వం ఎప్పుడు ఎంతెంత ఆర్థిక సహాయం చేసిందో లెక్కలన్నీ ఉన్నాయన్నారు.

గోనెసంచులివ్వాలని ఆర్‌బికె వద్ద ధర్నా



రైతు భరోసా కేంద్ర వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - నరసాపురం

వెంటనే గోనెసంచులిచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. మల్లవరం రైతుభరోసా కేంద్రం వద్ద కౌలురైతులతో మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకపక్క వాతావరణం మారిపోయి రైతులు ధాన్యం మాసూలు చేసేందుకు నానా ఇబ్బందులు పడుతూ ధాన్యం పట్టేందుకు సంచుల కోసం తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కౌలురైతులు ధాన్యం పట్టాలంటే సంచులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గోనె సంచులు ఇవ్వాలని, ఈ ఆర్‌బికె పరిధిలో ఇంకా 20 వేల సంచుల అవసరం ఉందని అన్నారు. సమస్యను డిఎస్ఒ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన స్పందించి మండల అధికారులతో మాట్లాడి వెంటనే సంచులిచ్చేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. తక్షణం రైతుభరోసా అధికారులు, సహకార సొసైటీ సిబ్బంది మిల్లుల వద్ద ఉన్న సంచులను వాహనాలు ఏర్పాటు చేసి రప్పించాలని రామాంజనేయులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలురైతులు పిల్లి కామేశ్వరరావు, యండాప జీవరత్నం, మందపాటి నర్సింహరావు, పులఖండం నారాయణరావు, బారతాల బ్రహ్మజీ, మహేంద్ర పాల్గొన్నారు.

హెల్త్ సిబ్బందికి ఎన్నికల అలవెన్స్ ఏది..?



పోలింగ్ కేంద్రం వద్ద డ్యూటీ చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా విధుల్లో పాల్గొన్న హెల్త్ సిబ్బందికి అలవెన్స్ లభించలేదు. సోమవారం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 1463 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. ఆయా కేంద్రాల వద్ద ఆశా వర్కర్లకు, అర్బన్ పిహెచ్‌సిల్లో పని చేసే సెకండ్ ఎఎన్ఎంలకు డ్యూటీలు వేశారు. ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభమైన మాక్ పోలింగ్ నుండి సాధారణ పోలింగ్ పూర్తయిన అర్ధరాత్రి వరకూ కేంద్రాల వద్ద హెల్త్ సిబ్బంది విధులు నిర్వర్తించారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 తర్వాత కూడా బూత్‌ల వద్ద ఆశాలు సేవలందించారు. ఇతర సిబ్బంది అందరికీ అలవెన్స్ అందిస్తున్న అధికారులు ఆశాలను మాత్రం పక్కనపెట్టినట్లు తెలుస్తోంది. ఉదయం నుంచి రాత్రి వరకూ సేవలందించినా అలవెన్స్ ఎగ్గొట్టడం దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి. చాలా పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులు, మహిళలు ఎండ వేడిమి తట్టుకోలేక స్పృహతప్పి పడిపోయారు. వారికి ఆశాలు ఒఆర్ఎస్ ప్యాకెట్లు కలిపి అందజేశారు. నరసాపురం పట్టణంలో పోలింగ్ బూత్ 36లో రాత్రి 10.30 గంటల వరకు పోలింగ్ సాగింది. అక్కడ పని చేస్తున్న ఆశా వర్కర్ ఇవిఎంలు బస్సులో బయల్దేరి వరకూ అక్కడే విధులు నిర్వర్తించింది. 2019 ఎన్నికల్లో ఆశాలకు కూడా పోలింగ్ డ్యూటీ వేసి అలవెన్స్ అందించారు. ఈసారి ఎన్నికల్లో నేరుగా డ్యూటీ వేయకుండా మెడికల్ క్యాంపు పేరుతో పోలింగ్ పూర్తయ్యే వరకూ ఆశాలతో పని చేయించారు. ఆశాలు తమకూ అలవెన్స్ ఇవ్వాలని ఇటీవల జిల్లా వైద్యశాఖాధికారికి వినతిపత్రం సైతం అందజేశారు. ఎన్నికల అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆశాలకు, వైద్య సిబ్బందికీ అలవెన్స్ ఇవ్వాలని అంతా కోరుతున్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సోమరాజు

ఉపాధి కూలీ రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఉపాధి కూలీలకు రోజు వారీ వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ బడ్జెట్‌లో రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో విషపురుగులు, మంచు బాబులు తగిన వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సిబిఎస్ఇలో వివేకానంద విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - తణుకురూరల్



ఎం.అంజని

2023 - 24 సిబిఎస్ఇ 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో వివేకానంద గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని పాఠశాల ప్రిన్సిపల్ రాయుడు రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎం.అంజని 500 మార్కులకు గాను 475 మార్కులు సాధించి తణుకు పట్టణంలోనే టాపర్‌గా నిలిచిందన్నారు. మొత్తం 42 మంది విద్యార్థులకుగాను అందరూ నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఎస్.లక్ష్మీప్రియ 457, బి.సాహితి 457, బి.నిఖిల ప్రియ 456, జి.హంసిని 453, ఎస్.షణ్ముఖసుందర 450 మార్కులు సాధించారన్నారు. విద్యార్థినులను స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, డైరెక్టర్ చిట్టూరి వెంకటకృష్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.



నవుదూరులో సత్కారంలో మాట్లాడుతున్న కుసుమ

జాతీయ లాంగ్‌జంపర్‌కు సత్కారం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం గ్రామానికి చెందిన జాతీయ లాంగ్‌జంపర్ రావాడ కుసుమను నవుదూరు జంక్షన్ నేషనల్ ఫ్లాగ్ టవర్ నిర్మాత వడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ఇటీవల జరిగిన జాతీయ లాంగ్‌జంప్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించినందుకుగాను కుసుమను అభినందిస్తూ ఆమెకు రూ.పది వేలు నగదు బహుమతిగా అందజేశారు. నవుదూరులో నేషనల్ ఫ్లాగ్ టవర్ వద్ద జరిగిన ఈ అభినందన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రానికి, జన్మభూమికి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చే క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వలవల శేషు, కొప్పిశెట్టి పార్వతి, వడ్డి సూర్యకుమారి, బండి ఆంజనేయులు పాల్గొన్నారు.

నరసాపురంలో 84.38 శాతం పోలింగ్

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 84.38 శాతం ఓట్లు పోలయ్యాయని రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ తెలిపారు. మొత్తం 1,70,448 ఓటర్లకు గాను 1,43,825 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. ఓట్లు వేసిన వారిలో 72,598 మంది పురుషులు, 71,227 మంది మహిళా ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. 2019 ఎన్నికల్లో 81.19 పోలింగ్ శాతం నమోదైంది. ఈ సారి 3 శాతం పెరిగింది. పెద్ద ఎత్తున మహిళలు, వృద్ధులు, వికలాంగులు మండే ఎండను సైతం లెక్కజేయకుండా పోలింగ్ బూత్‌లకు తరలివచ్చారు.

విజయం మనదే..

వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

స్థానిక ఎన్నికల్లో గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నామని వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెం వైసిపి కార్యాలయంలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో ఎస్‌సి, బిసి, ఒసి తదితర సామాజిక తరగతులకు చెందిన ప్రజా ప్రతినిధులు, అభిమానులు ప్రస్తుత ఎన్నికల్లో వైసిపికి అండగా ఉండి మంచి కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పెదఅమిరంలో పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరం టిడిపి ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజు పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, మంతెన పెద నరసింహరాజు, ఉండి నియోజకవర్గంలోనూ టిడిపి, జనసేన ముఖ్య నాయకులు, కార్యకర్తలు కలిసి అయనకు శుభాకాంక్షలు తెలిపారు.

45 రోజులుగా మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - కాళ్ల

రోజురోజుకూ వేసవి తాపం పెరిగిపోతుండడంతో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దాట్ల వెంకట్రామరాజు మంగళవారం తెలిపారు. 45 రోజుల నుంచి ప్రజలకు ఉచితంగా చల్లని మజ్జిగను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మూడేళ్లుగా రూ.85 లక్షలు ఖర్చు చేశామన్నారు. కాళ్లకూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్‌ఒ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఫిబ్రవరి నుంచి గ్రామ ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. 1,200 మంచినీటి క్యాన్లు ఉచితంగా అందించి ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళల్లో ఇంటికి నీటిని అందిస్తున్నామన్నారు.


పెదతాడేపల్లిలో చోరీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

పెదతాడేపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో ఏడు కాసుల బంగారం చోరీ జరిగినట్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని పెదతాడేపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ తన కుటుంబసభ్యులతో కలిసి ఐదు రోజుల క్రితం తమిళనాడు తీర్థయాత్రలకు వెళ్లాడు. మరలా ఆదివారం శ్రీనివాస్ తన నివాసానికి వచ్చేసరికి బీరువాతాళం పగుల గొట్టి ఉంది. దీంతో బీరువాలోని ఏడు కాసుల బంగారం చోరీకి గురైందని బాధితుడు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తణుకులో 82.08 శాతం పోలింగ్

ప్రజాశక్తి - తణుకురూరల్



తణుకు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,34,575 మంది ఉండగా వారిలో పురుషులు 11,4435 మంది, మహిళలు 120135 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు. ఉదయం 9 గంటలకు కేవలం 8.29 శాతం ఓటింగ్ నమోదు కాగా 11 గంటలకు 20.05 శాతానికి, ఒంటి గంటకు 37.29 శాతం, 3 గంటలకు 52.56 శాతం, 5 గంటల 65.65 శాతం, పోలింగ్ నమోదైంది. రాత్రి 10.50 నిమిషాలకు 82.08 శాతం పోలింగ్ నమోదైంది. పోలైన మొత్తం ఓట్లు 1,92,544 ఉండగా అందులో పురుషులు 93,924 మంది, మహిళలు 98,616 మంది ఉన్నారు. ఎండ తీవ్రతంగా ఉండడంతో ఓటర్లు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ సాయంత్రం 4 గంటల నుంచి ఓటర్లు ఎక్కువగా పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న బూత్‌ల వద్దకు చేరుకున్నారు. రాజకీయ పార్టీలు ఆటోల్లో ఓటర్లను తరలించి, మళ్లీ ఇళ్ల వద్దకు చేర్చారు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో జగన్ సిద్ధం అనే నినాదంతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. టిడిపి, జనసేన, బిజెపి కూటమితో 2024లో బాబు భవిష్యత్తు గ్యారెంటీతో సూపర్ సిక్స్ పథకాలతో అధికారంలో కి రావాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.


వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఐదేళ్లు అధికారంలో ఉండి సంక్షేమ పథకాలు అమలు చేసినప్పటికీ మొదటి నుండి ఆ పార్టీకి చెందిన కొంత మంది నాయకులతో విభేదాలు ఏర్పడ్డాయి. దాంతో ఆ పార్టీలోనే ఉంటూ పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. మరికొంత మంది నాయకులు ఎన్నికల నేపథ్యంలో మరో పార్టీలోకి వెళ్లడం, టిడిపికి అనుకూలంగా పనిచేయడంతో నియోజకవర్గంలో వైసిపి పని అయిపోయిందని, రానుంది కూటమి ప్రభుత్వమేనని ఆశావహుల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

కారుమూరిపై ఉన్న వ్యతిరేకతతో రానున్న కాలంలో కూటమి ఎలాగైనా అధికారంలోకి రావాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సారి రెండు ప్రధాన పార్టీలూ ఎన్నికల రెండు రోజుల ముందు నుంచి నియోజకవర్గంలో ఓటుకు వైసిపి రూ.2 వేలు, ప్రతిపక్ష పార్టీ రూ.1500 పంచినట్లు తెలిసింది. ఎన్నికల సరళిని చూస్తే రాత్రి 11 గంటల వరకూ పోలింగ్ జరిగింది.

పోలింగ్ శాతం 82.08గా నమోదైంది. మొత్తం ఓటర్లు 1,92,544 ఉంటే అందులో పురుషులు 93,924 మంది, మహిళలు 98,616 మంది ఉన్నారు. అంటే పురుషుల కన్నా మహిళల ఓట్లు 4692 ఎక్కువగా పోలయ్యాయి. అయితే ఎవరికి వారు గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అభ్యర్థుల్లో కాస్ ఓటింగ్ గుబులు?

ప్రజాశక్తి - పెనుమంట్ర



ఆచంట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పెద్ద ఎత్తున క్రాస్ ఓటింగ్ జరిగిందని ఎన్నికల విశ్లేషకులు భావిస్తున్నారు. అధికార వైసిపి పార్లమెంట్, అసెంబ్లీలకు ఒంటిరి గానే పోటీ చేయగా, కూటమి నుంచి పార్లమెంట్‌కు బిజెపి అభ్యర్థి రంగంలో ఉన్నారు. దీంతో అసెంబ్లీ తరపున బ్యాలెట్‌లో సైకిల్ గుర్తు అన్ని చోట్లా కామన్‌గా ఉండగా, పార్లమెంట్‌కు కమలం గుర్తు ఉన్నందున కూటమి అభిమానులంతా సైకిల్‌కే ఓటు వేస్తారని వారు విశ్లేషణ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కమలం కంటే ఫ్యాన్ గుర్తుకే ఎక్కువ ఓట్లు పడి ఉంటాయని, ఇదంతా క్రాస్ ఓటింగ్ ప్రభావం అని వారు వ్యాఖ్యానిస్తున్నారు. అన్ని చోట్లా ఇరు పార్టీల నుంచి నోట్లు తీసుకున్న ఓటర్లు సమన్యాయం చేస్తే, ఒక ఓటు ఫ్యాన్, ఒక ఓటు సైకిల్‌కు వేయాలనుకుంటారని, అప్పుడు సైకిల్ అసెంబ్లీ బ్యాలెట్‌లోనే ఉన్నందున అక్కడ తప్పనిసరిగా ఓటు పడుతుందని కూటమి వర్గీయులు సైతం ధీమా వ్యక్తం చేయడం విశేషం. ఎవరి విశ్లేషణలు, ధీమాలు ఎలా ఉన్నా, అంతిమ తీర్పు తెలిసేది జూన్ 4 అన్నది అందరికీ విదితమే.

కూడికలు.. తీసివేతలు..!

ఓట్లపై అభ్యర్థుల మల్లగుల్లాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర



సాధారణ ఎన్ని కల్లో భాగంగా ప్రధాన ఘట్టం ముగియడంతో మంగళవారం ఆయా పార్టీల నేతలు ఎవరికి ఎన్ని ఓట్లు పోలయ్యాయి, ఎక్కడ ఎన్ని పోలయ్యాయి అనే లెక్కలతో మల్లగుల్లాలు పడుతున్నారు. ఆచంట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ మండలాల్లోని అన్ని గ్రామాలతో పాటు పోడూరు మండలంలో కొన్ని గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సోమవారం జరిగినా పోలింగ్ శాతం బట్టి, ఎక్కడ ఎన్ని పడ్డాయి, అందులో ఎవరికి ఎన్ని పడతాయి అనే లెక్కలతో, అందులో కూడికలు, తీసివేతలతో ఆయా పార్టీల పెద్దా, చిన్నా నాయకులు కాగితాలు ముందేసుకుని అంచనాలు కడుతున్నారు. ఇప్పటికే రెండు ప్రధాన పార్టీల శిబిరాల్లో పోటీ చేసిన అభ్యర్థులను కలుస్తున్న మండల, గ్రామ, బూత్ స్థాయి నాయకులు మీదే గెలుపు అంటూ ముందస్తు శుభాకాంక్షలు చెప్పుకుంటూ వెళ్లడం విశేషం.

లెక్క తేలాల్సిందే..!

ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల నిమగ్నం

ప్రజాశక్తి - నరసాపురం



ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో అభ్యర్థులు మంగళవారం ఎవరికి వారు గ్రామాలు, మండలాలు, వార్డులు, బూత్‌ల వారీగా లెక్కల్లో నిమగ్నమయ్యారు. పోలింగ్ ఏజెంట్ నుంచి పోలైన ఓట్ల జాబితాను ముందు పెట్టుకొని పార్టీ ముఖ్యనేతలతో కలిసి అంచనా వేస్తున్నారు. ఏ ప్రాంతంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయి? తమకు ఎన్ని వస్తాయి? అని పూర్తిస్థాయిలో అంచనాలు వేస్తున్నారు. తగ్గిన, పెరిగిన ఓట్లతో సైలెంట్ ఓటింగ్ ఎటువైపు మొగ్గు చూపే అవకాశం ఉందనే అంశాలపై ఆరాలు తీస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో ఇప్పటికే గెలుపు ఓటమిలపై అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఏం జరుగుతుందనే భయం ఉన్నప్పటికీ ఎవరికి వారు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓ పార్టీ 20 వేలకు పైబడి మెజార్టీ వస్తుందని అంచనా వేస్తోంది. మరో ప్రధాన పార్టీ 1000 ఓట్ల తేడాతో అయినా తామే గెలుస్తామని కుండ బద్దలు కొట్టి మరీ చెబుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఓ ప్రధాన పార్టీ 1500, మహిళా ఓటర్లకు క్వాలిటీ చీరలు, కొన్ని సామాజిక తరగతుల మహిళలకు రూ.100 అదనంగా, పురుషులకు మద్యం అందించారు. మరో పార్టీ వారు వెయ్యి రూపాయలు ,కొన్ని చోట్ల మందు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి పోలైన ఓట్లు ఎవరికి లాభం చేకూరుస్తాయో? ఎవరికీ నష్టం కలిగిస్తాయో? అని రాజకీయ విశ్లేషకులు అంచనాలు చేస్తున్నారు. వాటి ప్రభావం ఎలా ఉంటుందో మరి జూన్ 4 వరకూ వేచి చూడాల్సిందే.

రాష్ట్రం బాగుపడాలంటే కూటమి గెలవాలి

జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రం బాగుపడాలంటే కూటమి గెలవాలని జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి పోవాలంటే జగన్మోహన్ రెడ్డి పోవాలన్నారు. రాష్ట్రానికి నియోజకవర్గానికి ఏ విధమైన అభివృద్ధి చేయని వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపాలని చూస్తున్నారన్నారు. ఎక్కడెక్కడో దూర ప్రాంతాల్లో నివసిస్తున్న వారంతా ఓటు వేయడానికి వచ్చారని, వచ్చిన వారందరికీ కృతజ్ఞతలని తెలిపారు. అర్ధరాత్రి 11 గంటల వరకు కూడా లైన్లో వేచి ఉండి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలని తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని ఆంధ్ర రాష్ట్రంలోనే అత్యంత అభివృద్ధి చెందే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, దేశంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా పవన్ కళ్యాణ్ అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారన్నారు. టిడిపి ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో జనసేన గెలుపు ఖాయమని, వైసిపి అభ్యర్థి కొట్టు సత్యనారాయణకు ఓటమి తప్పదని అన్నారు. బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడారు. పోలింగ్‌లో ప్రజల్లో చైతన్యం కనిపించిందన్నారు. కార్యక్రమంలో జనసేన, బిజెపి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని రక్షించుకోండిలా..

మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడిసి నష్టపోయిన రైతులు ఆ ధాన్యాన్ని తగిన చర్యలు ద్వారా కాపాడుకోవాలని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ పరిశోధనా సంచాలకులు ఎడిఆర్ డాక్టర్ ధన్యంపూడి శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో సాగుచేసే పంటల్లో వరి ప్రధానమైందన్నారు. ప్రస్తుతం దాళ్వాలో వరి మాసూళ్లు జరుగుతుండగా, అకాల వర్షాలకు ధాన్యం తడిసిన రైతులు కొన్ని మెలకువలు పాటించడం ద్వారా నష్టాన్ని కొంతవరకూ తగ్గించ్చున్నారు. వరి గింజ పోసుకుని, గట్టిపడే దశలో ఉంటే వెన్ను బరువు వల్ల కొద్దిపాటి గాలి, వర్షానికే నేలకు ఒరిగిపోతాయని తెలిపారు. ఇలా పడిపోయిన చేలల్లో యంత్రాలతో కోతలకు ఎక్కువ సమయం, ఖర్చులు పెరుగుతాయన్నారు. ఒరిగిన చేలను నిలబెట్టి తాళ్లతో కట్టడం ద్వారా నష్టనివారణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కోత కోసి పొలాల్లో ఉన్న వరి పనులు వర్షానికి తడిసినట్లయితే గింజ మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గి, ఎండ రాగానే పనలను తిరగేసి, ఎండబెట్టి నూర్పిడి చేయాలన్నారు. నూర్పిడి తర్వాత ధాన్యం ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తడమే గాక, రంగు మారి చెడు వాసన వస్తుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి క్వింటా ధాన్యానికి కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యాన్ని పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తి చెడిపోకుండా నివారించవచ్చని తెలిపారు.

నేనే గెలుస్తా..

వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గంలో వైసిపి తరపున జిల్లాలో మొట్టమొదటిగా గెలిచేది తానేనని వైసిపి ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెం వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టిడిపి కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ ఓటమి భయంతో తనపై లేనిపోని నిందలు వేస్తూ రాజకీయం చేస్తున్నారన్నారు. పితాని గెలుపొందితే మరో కొత్త పితానిని చూస్తారంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రజాస్వామ్య వ్యవస్థలో గౌరవం సంపాదించుకోవాలి తప్ప ఇటువంటి చిల్లర రాజకీయాలు చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. తనకు 1400 ఎకరాలు పుట్టుకతో వచ్చిన ఆస్తి అని, తమ కుటుంబం అంతా గౌరవప్రదంగా నడుచుకుంటాం తప్ప, పితానిలా ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం తనకు చేతకాదని తెలిపారు. ఎంపీ అభ్యర్థి వర్మ కౌన్సిలర్ కూడా గెలవలేని వ్యక్తి తనపై పరిమితి దాటి మాట్లాడుతున్నారని, ఆయన క్యారెక్టర్ ఏంటో అందరికీ తెలుసుని విమర్శించారు. ఆచంట నియోజకవర్గంలో గతంలో కంటే రెట్టింపు మెజార్టీతో గెలుపొందుతానని ధీమా వ్యక్తం చేశారు.

ధర్మానికి, అధర్మానికి యుద్ధం : కొట్టు


తాడేపల్లిగూడెం:సోమవారం జరిగిన ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి యుద్ధం వంటివని వైసిపి అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు,. పోలింగ్‌లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొనడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఉన్నంతకాలం రౌడీలు, గూండాల ఆటలు సాగనీయనన్నారు. ఈ ఎన్నికల్లో ధర్మం గెలుస్తుందని, వైసిపి పెద్ద మెజార్టీతో విజయ ఢంకా మోగించబోతుందని తెలిపారు.

మృతి చెందిన పాముకు దహన సంస్కారాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి మేళంవారిమెరకలో మంగళవారం మృతి చెందిన తాచుపామును స్థానికులు దహనం చేశారు. గ్రామంలో ఇల్ల మధ్య ప్రజలు చూస్తూ ఉండగా తాచుపాము మృతి చెందింది. స్థానికులు మేళం గోపాలకృష్ణ పోతుల సత్యనారాయణ తదితరులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

జిల్లాలో 82.60 శాతం పోలింగ్



ఇవిఎంలు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చి సీల్ వేయిస్తున్న కలెక్టర్

సోమవారం రాత్రి వరకూ కొనసాగిన పోలింగ్

అత్యధికంగా ఉండి, స్వల్పంగా భీమవరం నియోజకవర్గంలో పోలింగ్ నమోదు

స్ట్రాంగ్‌రూముల్లో ఏడు నియోజకవర్గాల ఇవిఎంలు భద్రం

పర్యవేక్షించిన జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై సాయంత్రం ఆరు గంటలతో ముగియాల్సి ఉన్నప్పటికీ ఇవిఎంలు మొరాయించడం, ఓటింగ్ నత్తనడకన సాగడతో 6 గంటల తర్వాత క్యూలో ఉన్న ప్రతిఒక్కరికి ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో రాత్రి 11 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. జిల్లా మొత్తం 14,72,928 మంది ఓటర్లకుగాను 12,16,667 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. జిల్లావ్యాప్తంగా 82.60 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో సాధారణ పరిశీలకులు ఎం.దీప, ఎల్.నిర్మల్‌రాజ్ క్షేత్రస్థాయిలో పోలింగ్‌ను పరిశీలించడంతోపాటు ఇవిఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లో ఉంచి సీల్ చేసే వరకు పూర్తిస్థాయిలో పర్యవేక్షించారు. జిల్లాలో అత్యధికంగా ఉండి నియోజకవర్గంలో 86.20 శాతం పోలింగ్ నమోదవ్వగా, కొంచెం స్వల్పంగా భీమవరం నియోజకవర్గంలో 79.35 శాతం ఓటింగ్ నమోదైంది. తెల్లవార్లు రెండు కళాశాలలోని రిసెప్షన్ సెంటర్లను, స్ట్రాంగ్ రూములను స్వయంగా పరిశీలించి అధికారులకు సూచనలు జారీ చేస్తూ రిటర్నింగ్ అధికారులను సిబ్బందిని జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ప్రోత్సహించారు. ఎన్నికల్లో కష్టపడి పని చేసిన సిబ్బంది, అధికారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

18 నుంచి 55 సంవత్సరాల మహిళలకు ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ రొక్కాల నాగ బుజ్జి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీస్ చేత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలపరిమితి 30 రోజులని, అదనపు వివరాల కోసం నంబర్ 6305683467ను సంప్రదించాలని తెలిపారు.